నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 20 మే 2025 | MAHABUBNAGAR NARAYANPET

తరుగు పేరుతో రైతుల నిలువుదోపిడీ

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- ఎన్మన్‌బెట్ల ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం

కొల్లాపూర్ రూరల్, మే 19 : కాంగ్రెస్ ప్రభుత్వం తరుగు పేరుతో రైతులను నిలువుదోపిడీ చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. మండలంలోని ఎన్మన్‌బెట్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో తరుగుపేరుతో ఐదు కిలోల ధాన్యాన్ని ఎక్కువగా తీస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సోమవారం ఎన్మన్‌బెట్లలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంత ముందుకు సంచికి 40 కేజీలకు 1500 గ్రాములు తీసేవారని ఇప్పుడు తరుగు పేరుతో 5 కేజీలు తీస్తున్నారని రైతులు మాజీ ఎమ్మెల్యే ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు చేయకుండా కాలయాపన చేస్తున్నదని, దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కాపాడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆకాల వర్షాలతో ధాన్యం తడిసి రైతులు కన్నీరు పెడుతుంటే ప్రభుత్వ పెద్దలు రైతులను ఓదార్చకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రజాపాలన అని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రభుత్వంలో రైతులను కన్నీరు పెట్టిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు రైతు భరోసా ఇవ్వకుండా, రుణమాఫీ సక్రమంగా అమలు చేయకుండా రైతులను ఇబ్బందులు పాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, లేదంటే రైతుల తరపున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐకేపీ ఇన్‌చార్జి స్వర్ణమ్మ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సురేందర్‌రావు, భాస్కర్‌గౌడ్, సాయికృష్ణ , గోవింద్‌గౌడ్, ఆటో రాముడు, మీసాల కురుమయ్య, మంచాల కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం రాకతో ముందస్తుగా అరెస్టులు

అమ్రాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న చెంచు నాయకులు

అమ్రాబాద్, మే 19 : మండలంలోని మాచారం గ్రామానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, చెంచు నాయకులు, బీజేపీ నాయకులను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మన్ననూర్‌లోని ఐటీడీఏ కార్యాలయాన్ని వేరే ప్రాంతానికి తరలింపజేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చెంచుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏను మన్ననూర్‌లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని, రెగ్యులర్ ఐటీడీఏ పీవోను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతారనే ఉద్దేశంతో అరెస్టులు చేశారని ఈ అరెస్టులతో ప్రశ్నించే గొంతుకలను ఆపలేరని వారు పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో చెంచు ఐక్య సంఘాల నేతలు మల్లి కార్జున్, గురువయ్య, మన్ననూర్ మాజీ సర్పంచ్ శ్రీరామ్‌నాయక్, వివిధ పార్టీల నాయకులు నాగరాజు, శంకర్ తదితరులు ఉన్నారు.

నాట్లేసి నిరసన

- టంకర-గుడ్డిమల్కాపూర్ రోడ్డుపై నిలిచిన నీరు

రోడ్డుపై నాట్లు వేస్తూ నిరసన చేపట్టిన గుడ్డిమల్కాపూర్ ప్రజలు

హన్వాడ, మే 19 : మండలంలోని టంకర-గుడ్డిమల్లాపూర్ గ్రామాలకు వెళ్లే రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో సోమవారం గుడ్డిమల్కాపూర్ గ్రామస్తులు రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో టంకర నుంచి గుడ్డిమల్కాపూర్ వరకు బీటీ రోడ్డు మంజూరు కాగా రోడ్డుకు ఇరువైపులా మట్టి వేయడంతో వర్షపునీరు రోడ్డుపై నిల్వ ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 17నెలలు కావస్తున్నా రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని గతంలో పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నేటికీ పనులు పూర్తి చేయక పోవడం సిగ్గుచేటన్నారు. రాత్రి వేళల్లో రోడ్డుపై వెళ్లాంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని టంకర, గుడ్డిమల్కాపూర్ గ్రామస్తులు కోరుతున్నారు.

పొలంలోకి రానీయడం లేదంటూ..

రోడ్డుపై బైఠాయించిన మహిళా రైతు

రోడ్డుపై బైఠాయించిన తల్లీకూతురు రాణి, మంజుల

గట్టు, మే 19 : తన పొలంలోకి తననే రానీయకుండా మరిది అడ్డుకుంటున్నాడని నిరసిస్తూ ఆలూరు గ్రామానికి చెందిన రాణి తన కూతురు మంజులతో కలిసి గట్టు పోలీస్‌స్టేషన్ సమీపంలో గట్టు-మాచన్‌పల్లి రోడ్డుపై సోమవారం బైఠాయించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త అనారోగ్యంతో మృతి చెందగా విరాసత్‌గా 183/డీ1, 188/డీ1, 184/జీ సర్వే నెంబర్లలోని ఎ.1.32గుంటల భూమి తనకు భూ బదాలాయింపు జరిగిందన్నారు. అయితే ఆ పొలంలోకి తనకు వెళ్లనీయకుండా తన మరిది మల్లేశ్ అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆమె ఆరోపించింది. ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులు, పోలీసుల చుట్టూ తిరిగినా ప్రయోజనం కనిపించడం లేదని వాపోయింది. ఈ పొలంతో పాటు తనకు వాటాగా రావాల్సిన ఎ.7.18గుం.ల భూమిని కూడా తన మరిది అక్రమంగా గిఫ్ట్‌డీడ్ చేయించుకున్నాడని ఆమె ఆరోపించింది. తనకు కుమారులు లేరని, ఒకే కూతురు ఉందన్నారు. మహిళలమని చెప్పి తమను కష్టాలకు గురిచేస్తున్నారని, దీన్ని ఎంతవరకూ భరించాలని ఆమె ప్రశ్నించారు. ఈ విషయంలో ఉన్నతాధికారులైనా స్పందించి తమకు న్యాయం చేయాలని తల్లీకూతుళ్లు కోరుతున్నారు.

నాణ్యత లేని నిర్మాణం.. కూలిన డ్రైనేజీ

- అధికారుల నిర్లక్ష్యమే కారణమని స్థానికుల ఆరోపణ

జమిస్తాపూర్‌లో వర్షానికి కూలిపోయిన డ్రైనేజీ

పాలమూరు, మే 19 : మహబూబ్‌నగర్ మండలం జమిస్తాపూర్ గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.10లక్షలతో హనుమాన్ ఆలయం నుంచి ఎస్సీ కమ్యూనిటీ హాల్ వరకు 8 రోజుల కిందట నూతనంగా నిర్మించిన డ్రైనేజీ గత రాత్రి పడిన చిన్న పాటి వర్షానికి కూలిపోయింది. అధికారుల నిర్లక్ష్యం వలన నిర్మాణ పనులు లోపభూయిష్టంగా చేయడంతో కాల్వ కూలిపోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. గతంలో రాయితో నిర్మించిన కాల్వను తొలగించి కేవలం సిమెంట్ సాంచతో కాల్వలు నిర్మించాలని పాత కాల్వకు సంబంధించిన రాయి గ్రామ పంచాయతీ సంబంధించిన రాయి అయిన అది ప్రైవేట్ వ్యక్తుల ఇండ్ల వద్ద డంపు చేసుకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై అధికారులను సంప్రదించగా స్పెషల్ ఆఫీసర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ, ఎంపీడీవో, ఏఈ ఒక దగ్గర ఒకరు బొంకడం జరిగింది. దీనిపై ఉన్న తాధికారులైనా స్పందించి వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

గద్వాల మండలం పరుమాల శివారులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లు

గృహయోగం ఎప్పుడో..?

- రెండేళ్లు దాటినా గద్వాలలో కేటాయించని డబుల్ ఇండ్లు
- సొంతింటి కల కోసం పేదల ఎదురుచూపులు
- అధికారుల జాప్యంపై లబ్ధిదారుల ఆగ్రహం
- ఇండ్లకు మౌలిక వసతుల కల్పనలో విఫలం
- కేసీఆర్ ప్రభుత్వం గూడు కల్పించినా అందని వైనం

ఇండ్లకు రక్షణ కరువు..

గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం పూర్తై రెండేండ్లు కావస్తున్నా అవి లబ్ధిదారులకు కేటాయించక పోవడంతో వాటికి రక్షణ లేకుండా పోయింది. లబ్ధిదారులకు కేటాయించక పోవడంతో వాటికి ఏర్పాటు చేసిన గ్లాస్ కిటికీలు, అద్దాలు పగిలిపోతున్నాయి. పర్యవేక్షణలేక పోవడం మందుబాబులకు అడ్డాగా మారినట్లు లబ్ధిదారులు వాపోతున్నారు. అవి లబ్ధిదారులకు కేటాయించే వరకు అధికారులు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గద్వాల, మే 19 : ఇండ్లు లేని పేదలకు ఇండ్లు నిర్మించి ఇచ్చి పేదోడి సొంతింటి కల నెరవేర్చాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల కోసం జిల్లా కేంద్రంలో డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేసింది. అధికారులు , కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా అవి నేటికీ లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో వారి తీరుపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరి నిర్లక్ష్యం కారణంగా ఇండ్ల నిర్మాణాలు పూర్తయినా పేదవాడి సొంతింటి కల మాత్రం నెరవేరడం లేదు. 2023 ఏప్రిల్‌లో ఇండ్లు లేని నిరుపేదలు డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని అప్పటి కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించగా అర్హులైన వారు దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు నిజంగా ఇళ్లు ఉందా లేదా అనే విషయాన్ని వార్డుల వారీగా అధికారులను నియమించి పూర్తి స్థాయి విచారణ చేసి లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం అర్హులను ఎంపిక చేయడంలో భాగంగా డిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. లబ్ధిదారులను ఎంపిక చేసి నేటికి రేండేళ్లు దాటినా ఇప్పటి వరకు లబ్ధిదారులకు ఇండ్ల కేటాయింపు జరగక పోవడంతో వారు సొంతింటి కల కోసం ఎదురుచూస్తున్నారు. నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లకు మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలం కావడంతో నేటికి ఇండ్లు ఖాళీగానే ఉండిపోయాయి. ప్రస్తుత కలెక్టర్ వేగవంతంగా మౌలిక వసతులు కల్పించాలని కాంట్రాక్టర్లకు ఆదేశించినా నేటికి డబుల్ బెడ్రూం ఇండ్లకు మౌలిక వసతులు కల్పించక పోవడంతో వాటిని లబ్ధిదారులకు కేటాయించలేక పోతున్నారు. గతంలో ఎంపిక చేసిన లబ్ధిదారుల్లో దాదాపు 98మంది పేర్లు గల్లంతు అయినట్లు తెలుస్తోంది. ఎంపిక జాబితాను రాజకీయ పలుకుబడితో మార్పు చేసినట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. దీంతో ఎంపికైన లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొన్నది.

డబుల్ బెడ్రూం ఇండ్ల వివరాల్లోకి వెళితే..

గద్వాల పట్టణ సమీపంలో పరుమాల శివారులో గత తెలంగాణ ప్రభుత్వంలో 41ఎకరాల్లో 1,275 డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం చేపట్టింది. ఇండ్ల నిర్మాణం జీ ప్లస్‌గా నిర్మించారు. ఒక్కో బ్లాక్‌లో 24 ఇండ్లు నిర్మించారు.1,275 డబుల్ ఇండ్లకు అధికారులు దరఖాస్తులు 2023 ఏప్రిల్ ఆహ్వానించారు. 1,275ఇండ్లకు గాను 5,155మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి పూర్తి స్థాయిలో విచారణ చేయగా అందులో 3,171మంది అర్హులుగా గుర్తించారు. అయితే ఇందులో గతంలో పట్టాలు పొందిన వారు ఉండగా వారు కోర్టుకు వెళ్లారు. కోర్టుకు వెళ్లిన 504మంది లబ్ధిదారులకు సంబంధించి ఇండ్లను డిప్‌లో వేయకుండా 771ఇండ్లకు డిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే ఎంపిక చేసిన సమయంలో డిప్‌లో ఇల్లు పొందిన వారికి ప్రొసీడింగ్ ఇవ్వలేదు. దీంతో డిప్‌లో ఇండ్లు పొందిన వారు తమ సొంతింటి కల కోసం ఎదురుచూస్తున్నారు. ఇండ్లకు డిప్ వేసిన సమయంలో ఇండ్లకు కొన్ని మౌలిక వసతులు కల్పించే విషయంలో వారికి కేటాయించలేదు. అవి కల్పించిన తర్వాత అందరిని ఒకేసారి గృహ ప్రవేశం చేయిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు రావడంతో డిప్‌లో డబుల్‌బెడ్రూం ఇల్లు పొందిన వారి సొంతింటి కలపై ఎన్నికల కోడ్ నీళ్లు చల్లినట్లు అయింది. ఎన్నికలు జరిగి ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటి వరకు డబుల్ ఇండ్లకు సంబంధించి లబ్ధిదారులకు కేటాయింపులో జాప్యం జరుగుతుంది. దీంతో లబ్ధిదారులు భయాందోళనకు గురి అవుతున్నారు. తమకు డిప్‌లో తగిలిన ప్రస్తుతం గద్వాలలో మారుతున్న రాజకీయ పరిస్థితుల ప్రభావం కారణంగా ఇళ్లు వస్తుందో రాదో అనే ఆందోళనలో లబ్ధిదారులు ఉన్నారు. డిప్ తీసి 2025 ఏప్రిల్‌తో రెండేళ్లు పూర్తయ్యాయి. అయినా లబ్ధిదారులకు ఇండ్ల కేటాయింపులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండంతో వారి తీరుపై ఇండ్లు లేని నిరుపేదలు గుర్రుగా ఉన్నారు. త్వరగా డబుల్ బెడ్రూం ఇండ్లకు సంబంధించి మౌలిక వసతులు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించడం, స్వయంగా డబుల్ బెడ్రూం ఇండ్ల పరిశీలించి పనులు వేగవంతం గా చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించినా ఆ దిశగా పనులు సాగడం లేదు. దీంతో డబుల్ ఇండ్లపై లబ్ధిదారులు ఆశలు వదులుకునే పరిస్థితి నెలకొన్నది. దీంతో పాటు డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులకు కేటాయించక పోవడంతో చాలా మంది లబ్ధిదారులు,ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తున్నది. ఇటు డబుల్ బెడ్రూం ఇండ్లు రాక, అటు ఇందిరమ్మ ఇండ్లకు ఇచ్చే డబ్బులు సరిపోక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కలుగజేసుకొని మౌలిక వసతుల పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. వెంటనే మిగిలిపోయిన పనులు పూర్తి చేసే విధంగా కలెక్టర్, ఎమ్మెల్యే చొరవ చూపి లబ్ధిదారులకు ఇండ్లు అందజేయాలని ఇండ్లు లేని నిరుపేదలు కోరుతున్నారు.

అధికారులతో కలిసి డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోశ్ (ఫైల్)

కొనుగోళ్ల బిల్లులు ఇవ్వండి

- మక్తల్‌లో రాస్తారోకోకు దిగిన రైతులు
- భారీగా నిలిచిన వాహనాలు

ధర్నాతో నిలిచిపోయిన వాహనాలు

మక్తల్, మే 19 : యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతన్నలకు నెలలు గడుస్తున్నప్పటికీ ఖాతాల్లో డబ్బులు జమకాలేదు. దీనిని నిరసిస్తూ సోమవారం మక్తల్‌లోని జాతీయ రహదారి(167)పై రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పుర రైతులు మాట్లాడుతూ యాసంగిలో పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని గొప్పలు చెప్పుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు రైతులకు సకాలంలో గన్నీ బ్యాగులు అందించక పోవడంతో ధాన్యం కల్లాల్లోనే తడిసి ముద్దయి తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు అమ్మేందుకు ఖాళీ సంచుల కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగి అమ్మడం ఒక ఎత్తు అయితే.. వాటిని మిల్లుల తరలించడం కోసం రోజుల తరబడి ధాన్యాన్ని కల్లాల్లో ఉంచుకొని లారీల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి రావడం మరో ఎత్తు అన్నారు. అయినా ఎలాగో అలా కష్టపడి ధాన్యం అమ్మి నెలలు గడుస్తున్నా ఇంకా వాటికి సంబంధించి డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం అమ్మిన డబ్బులు వెంటనే ఖాతాల్లో జమ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రైతుల రాస్తారోకో విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని పీఏసీఎస్ సిబ్బందిని పిలిపించి రైతుల ధాన్యం డబ్బులు త్వరలో ఖాతాలో జమ చేయించాలని సూచించడంతో వారు రైతులకు త్వరలో డబ్బులు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యం బిల్లులు ఇవ్వాలని మక్తల్‌లో ప్రధాన రోడ్డుపై రాస్తారోకో చేపట్టిన రైతులు

జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్‌లో రోడ్డుపై బైఠాయించిన రైతులు

కొన్న ధాన్యం తరలించాలి

- సెంటర్‌లో తూకమైన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించండి
- కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నాం
- నిరసనలో రైతుల డిమాండ్
- మల్దకల్ గద్వాల- అయిజ రోడ్డుపై ఆందోళన

మల్దకల్, మే 19 : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండలకేంద్రంలో గద్వాల-అయిజ రోడ్డుపై రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ నెల రోజులుగా ధాన్యం కొనుగోళ్లు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా 15రోజుల కిందట కొనుగోలు చేసిన ధాన్యాన్ని సైతం నేటికీ మిల్లులకు తరలించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతున్నాయని, దీని వల్ల అధికారులు ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టాలని చెబుతున్నారని, ధాన్యం తరలించే వరకు రైతులు కొనుగోలు కేంద్రాల వద్దే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు వెంటనే చేపట్టాలని లేదంటే ఆందోళన విరమించే ప్రసక్తే లేదని భీష్మించుకు కూర్చున్నారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని అధికారులతో రైతులను మాట్లాడించడంతో రైతులు ఆందోళన విరమించారు. ధాన్యం కొనుగోళ్ల విషయాన్ని పీఏసీఎస్ సీఈవో కిరణ్‌కు మాదిరెడ్డిని వివరణ కోరగా సెంటర్‌లో 50మంది రైతులకు సంబంధించిన ధాన్యాన్ని కొనుగోలు చేశామని, 20 వేల బ్యాగులు కాంటా వేసినట్లు చెప్పారు. 8వేల క్వింటాళ్ల ధాన్యాన్ని వారం రోజులు కిందట కొనుగోలు చేశామన్నారు. అయితే మిల్లులకు పంపించడానికి లారీల రాక పోవడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న డీటీలు ఉదయ్‌కిరణ్, ప్రశాంత్‌గౌడ్ కొనుగోలు కేంద్రానికి వచ్చారని, వెంటనే రెండు లారీల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. మిగతా వారిటిని కూడా త్వరలో మిల్లులకు తరలిస్తామని చెప్పారు.

రైతులకు తీరని గన్నీ గోస

- చిన్నమందడి సెంటర్‌లో బ్యాగులు లేక నిలిచిపోయిన తూకం
- ఆగ్రహంతో రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకుల నిరసన

చిన్నమందడి కొనుగోలు కేంద్రం వద్ద నిరసన తెలియజేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

పెద్దమందడి, మే 19 : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని రైతులు అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చినప్పటికి ఇబ్బందులకు గురవుతున్నారు. కేంద్రాలలో ధాన్యం ఆరబెట్టినప్పటికి తూకాలకు నోచుకోవడం లేదు. గన్ని బ్యాగులు ఉంటే లారీలు ఉండవు, లారీలు వస్తే గన్నీ బ్యాగులు ఉండవు ఇలా ఇబ్బందులు పడుతూ రైతులు తూకాలు పడుతారు, మా ధాన్యం తీసుకెళ్తారని పెద్దమందడి మండలం చిన్నమందడి గ్రామంలోని కొనుగోలు కేంద్రాలలో రైతులు పడిగాపులు కాస్తున్నారు. సోమవారం కొనుగోలు కేంద్రం వద్ద తూకాలు చేయడానికి గన్నీ బ్యాగులు లేకపోవడంతో రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అకాల వర్షాలు కురుస్తూ ఆరుగాలం పండించిన పంట కళ్ల ముందే తడిసి మొలకలు ఎత్తుతుంటే రైతులను పట్టించుకునే పాపాన ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు కానీ లేరని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికి చిన్నమందడి గ్రామంలో సగానికి పైగా వడ్లు కొనుగోలు కేంద్రాల దగ్గరనే నిలిచిపోయాయని వారు ఆందోళన చెందుతున్నారు. సరిగ్గా వారం రోజులు కూడా లేదు వర్షాకాలం సూచన ప్రారంభం అవ్వడానికి రోహిణి కార్తీ వచ్చిన వడ్లు మాత్రం కల్లాల దగ్గరే ఉండేటట్లు ఉన్నాయని ఆందోళన చెందుతున్నామని రైతులు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం కళ్లు తెరిచి త్వరగా కొనుగోలు కేంద్రాలకు గన్ని బ్యాగులను , లారీలను పంపించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ గొర్రెల కాపరుల సంఘం డైరెక్టర్ నాగేంద్రం యాదవ్, కృష్ణారెడ్డి, రామ్‌రెడ్డి, బాల రాజు, శ్రీనివాస్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి జిల్లాలో గోదాంల వద్ద అన్‌లోడింగ్ కోసం నిలిపిన లారీలు

గోదాంల వద్ద పడిగాపులు

ఖిల్లా ఘణపురం, మే 19 : ఖిల్లాఘణపురం వరిగోదాంలలో ధాన్యం నిల్వలపై గోపాలపేట, ఖిల్లాఘణపురం నాయకులు , రైతులు గోదాం ముందు దగ్గర సోమవారం వాదనలు పెట్టుకున్నారు. గోపాలపేట మండలం నుంచి దాదాపుగా 30 లారీల వరిధాన్యం ఖిల్లాఘణపురంలో ఉన్న గోదాం ముందు అలాట్ చేశారు. మండలానికి సంబంధించి ఇంకా 60 లారీల ధాన్యం ఇంకా ఉందని ఈ ధాన్యం మొత్తం తీసుకున్నాకే ఇతర మండలం నుంచి ధాన్యం తీసుకోవాలని రైతులు అక్కడి నుండి వచ్చిన లారీల్లో ధాన్యం దించకుండా ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న సివిల్ సప్లయి అధికారి బాలు అక్కడికి చేరుకొని ఇరు మండలాల నాయకులను, రైతులను శాంతింపజేసి గోపాల్‌పేట మండలానిది ఒకటి, ఖిల్లా ఘణపురం మండలానిది ఒక లారీని ధాన్యం దించుకోవాలని ఇరు వర్గాలకి నచ్చజెప్పారు. దీంతో లారీలలో ఉన్న ధాన్యాన్ని గోదాం ముందులో దింపారు. మండలంలో ఉన్న రైతుల ధాన్యం దింపిన తర్వాతనే ఇతర మండలాల ధాన్యాన్ని దింపేలా చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరారు.